క్లుప్తంగా

పాలధర పెంపుపై హర్షం

మోపిదేవి: కృష్ణామిల్క్ యూనియన్ పాలక వర్గసభ్యులు పాడిరైతులకు తీపి కబురు అందించారని మండలంలోని పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు హర్షం వ్యక్తంచేశారు. మోపిదేవిలో సంఘాల సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న లీటరు ధర రూ.73ను రూ. 5 పెంచి జనవరి 1, 2023 నుంచి లీటరు రూ. 78 చేసినట్లు తెలిపారు. మండలంలోని సంఘం అధ్యక్షులు బొందలపాటి వెంకట వరప్రసాద్, పుప్పాల సతీష్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

12 మంది జూదరుల అరెస్ట్

నాగాయలంక: స్థానిక పీఎస్ పరిధిలోని భావదేవరపల్లిలో శనివారం అర్ధరాత్రి పేకాడుతున్న 12 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడిచేయగా పేకాడుతున్న వారి నుంచి రూ.4,020 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి వారిని అవనిగడ్డ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

ఘనంగా సూర్యదేవుని శాంతి కల్యాణం

అవనిగడ్డ: వేకనూరు శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సూర్యదేవునికి శాంతి కల్యాణం జరిగింది. ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఉషా పద్మిని సమేత సూర్యనారాయణస్వామికి పండితులు దేవి బాలకృష్ణ విశేష పూజలు, శాంతి కల్యాణం చేశారు. ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

50 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న తోట శ్యాంకిశోర్‌నాయుడు

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని నేరెళ్ల పాలెంలో శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు 50 మంది వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం దృష్ట్యా వృద్ధులకు అందజేసినట్లు శ్యాంకిశోర్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో మునిపల్లి వెంకటేశ్వరరావు, మోపిదేవి కోటేశ్వరరావు, అవనిగడ్డ సాంబశివరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత నడకుదురు (చల్లపల్లి): నడకుదురు శివారు పాత నడకుదురులోని చర్చిలో ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యాభై మందికి రగ్గులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు వేములపల్లి రోజా, విజయ, స్విటిన్ రాస్ పాల్గొన్నారు.

అయ్యప్పల సేవాసమితి ఆధ్వర్యాన ప్రదర్శన

పెడన: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరెడ్డి నరేష్‌తో పాటు రాజేష్‌లను కఠినంగా శిక్షించాలని అయ్యప్పస్వాములు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జైభజరంగదళ్, అఖిలభారత అయ్యప్పస్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పలు స్థానిక గుడివాడ రోడ్డులోని శివాలయం నుంచి ప్రదర్శనగా పెడన పోలీస్‌స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించి పీఎస్‌లో వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు నాదేళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ ఏర్పాట్లు చేశారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత



తోట్లవల్లూరు: యాకమూరులో ఉయ్యూరు ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు పేద విద్యార్థినికి సైకిల్ అందజేశారు. గ్రామానికి చెందిన విద్యార్థిని ఆకుల నాగ విజయశ్రీకి ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ వాణి క్లబ్ తరఫున సైకిల్‌ను ఆదివారం అందించారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ



మోపిదేవిలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే రమేష్‌బాబు, నరసింహారావు తదితరులు



మోపిదేవిలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ మేరీరాణి



చినగుడమోటు గ్రామంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మోపిదేవి: కమిటీలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం న్యాయం చేస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రం మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆదివారం నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ గతంలో మండలానికి 5,0955 పింఛన్‌లు వచ్చేవని, కొత్తగా మరో 161 పింఛన్‌లు మంజూరవ్వగా మొత్తం 6,0116 మంది పింఛన్లకు సుమారు 1.72 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. తడిసిన ధాన్యానికి కూడా ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోందని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో వరుణుడు కరుణించేవాడు కాదని, జగనన్న అడుగు పెట్టిననాటి నుంచి వర్షాలు బాగా పడటంతో పంటలు కూడా బాగా పండుతున్నాయని తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడంతో పాటు వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. పేద ప్రజలు జగనన్నను దేవుడిగా కొలుస్తుండగా, టీడీపీకి విమర్శించడానికి ఏమీలేక బాదుడే, బాదుడు ..... ఇదేం ఖర్మరా బాబూ అంటూ ప్రచారం చేపట్టారని వారిని ప్రజలు విశ్వసించడం లేదని తెలిపారు. రంగాను హత్యచేసినప్పుడు, ముద్రగడపై దౌర్జన్యం చేసినప్పుడు బయటకు రాని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీ పక్షాన చేరి జగనన్న వ్యతిరేక ఓట్లు చీలనివ్వని, కాపు సామాజిక వర్గాన్ని చంద్రబాబుకు తాకట్టు పెడుతుండటంపై అందరూ నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని, కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా కావలసిన వారికే పింఛన్లు, పథకాలు పంచిపెట్టారని, నేడు జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందని చెప్పారు. ఎంపీడీఓ పార్వతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు, గ్రామ కార్యదర్శులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: నూతన సంవత్సరం వలంటీర్ల వెంట సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరిగి పింఛన్లు అందజేశారు. మోపిదేవిలో సర్పంచ్ నందిగం మేరీరాణి పెరిగిన పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని కోరారు. గ్రామ పార్టీ కన్వీనర్ కారుమూరి తాతయ్య, సచివాలయ కన్వీనర్ నందిగం శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్ రావి రామప్రసాద్, మాజీ చైర్‌పర్సన్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల వలంటీర్లు ఈ నెల కొత్తగా 310 పెన్షన్లు అందించారు. సచివాలయాలకు నూతనంగా నియమించిన కన్వీనర్లతో కలిసి పెన్షన్ల పంపిణీని వలంటీర్లు నిర్వహించారు. 39మంది సచివాలయ కన్వీనర్లతో పాటు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి పెరిగిన పెన్షన్లను అందించారు.

చినగుడమోటులో క్షీరాభిషేకం

కోడూరు: దివిసీమలో ముస్లిం గ్రామంగా పిలిచే కోడూరు మండలంలోని చినగుడమోటు గ్రామస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతవులకు పెన్షన్ నగదును రూ.2500 నుంచి రూ.2750కు పెంచడంతో ముస్లింలు జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే నేత సీఎం జగన్



అవనిగడ్డలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పంపిణీ చేశారు. పింఛన్లతో పాటు మిఠాయిలు ఇచ్చి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను రూ.2,750 కి పెంచారని చెప్పారు. కార్యక్రమంలో కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తలుపుతట్టి పింఛన్లు అందజేత



పింఛను అందజేస్తున్న 39వ డివిజన్ కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్

మచిలీపట్నంటౌన్: నూతన సంవత్సరం ప్రారంభం కాగానే నగరంలోని సామాజిక పింఛనర్లకు పింఛన్‌మొత్తాలను తలుపుతట్టి మరీ అందించారు. నూతన సంవత్సర ఘడియలు ప్రారంభం కాగానే నగరంలోని 50 డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా డివిజన్లలో నూతనంగా నియమించిన కన్వీనర్లు, వలంటీర్లు అందజేశారు. ఆదివారం రాత్రి 7 గంటల వరకు నగరంలో 88.89 శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. నగరంలో మొత్తం 18,690 పింఛన్లు ఉండగా వీటిలో 16,614 పింఛన్లను పంపిణీ చేశారు. అర్ధరాత్రి తలుపుతట్టి పింఛన్లు అందజేయడంపై పెన్షనర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పింఛను కష్టాలు తీరాయని మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా ఆశీర్వదిస్తామని పలువురు పెన్షనర్లు పేర్కొంటున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి నిత్యాన్నదానానికి రూ. 50,116 విరాళం



సుబ్బారాయుడు ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవిలో నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న భక్తులు సురేష్, వెంకట దుర్గా భవాని

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కలవపాములకు చెందిన భక్తులు గుళ్లపల్లి సతీష్, వెంకట దుర్గా భవాని దంపతులు రూ. 50,116 విరాళంగా అందజేశారు. ఉదయం స్వామివారి దర్శించుకున్న వీరు ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణకు విరాళాన్ని అందించారు. ఆలయ అధికారులు రామకృష్ణ, వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీ

నూతన సంవత్సరం మొదటి రోజు ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తులునిరీక్షించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అయ్యప్పకు తేనెతో అభిషేకం



అయ్యప్ప ఉత్సవమూర్తికి అభిషేకం

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో బంగారు అయ్యప్పకు ఆదివారం తేనెతో అభిషేకం చేశారు. 108 రజత కలశాలతో తొమ్మిది రకాల ద్రవ్యాలతో మహాభిషేకం చేశారు. గూడూరు రామకృష్ణశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకుడు తోలేటి అరుణ్‌కుమార్‌శర్మ అయ్యప్పకు నిత్య అలంకారాన్ని పూలతో అందంగా చేశారు. సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా అయ్యప్పకు 108 బంగారుపూలతో పూజ, అష్టదళ సువర్ణ పుష్పార్చన, అభిషేకాలు చేయనున్నట్లు భక్త బృందం తెలిపింది.

185 పింఛన్లు మంజూరు

చల్లపల్లి: మండలానికి వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద నూతనంగా 185 పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కేవీ సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పింఛన్ రూ.2,750 చొప్పున నూతన పింఛన్ లబ్ధిదారులకు గ్రామ వలంటీర్ల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు సత్కారం



కండక్టర్‌ను సత్కరిస్తున్న డీఎం హనుమంతరావు

అవనిగడ్డ: గతేడాది ప్రయాణికులకు మంచి సేవలు అందించి సంస్థకు ఆదాయం పెంచడానికి దోహదపడిన 15 మంది డ్రైవర్లు, కండక్టర్లను డిపో మేనేజర్ హనుమంతరావు ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు డీఎం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సీహెచ్ లక్ష్మి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, సంఘ నేతలు పాల్గొన్నారు.

సాయిబాబాకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేసిన దాతలు

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని శ్రీసాయిబాబా విగ్రహానికి దాతలు వెండి కిరీటం బహూకరించారని ఆలయ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు కోటి పాండురంగారావు, వరదా అప్పారావులు తెలిపారు. స్థానిక ఆలయంలో ఆదివారం దాతలు కిరీటాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ విజయవాడకు చెందిన బొర్లే లోకనాథం, శ్రీలక్ష్మీ లత దంపతులు సాయిబాబా విగ్రహానికి 500 గ్రాముల బరువైన రూ.35 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేకా పేరయ్య, యు ఉమామహేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

మచిలీపట్నంటౌన్: నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని ప్రధాన పార్కులో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సునీల్ ఆర్కెస్ట్రా బృందం గాయనీ, గాయకులు పాత, కొత్త సినీ గీతాలను ఆలపించి ఉర్రూతలూగించారు. కార్యక్రమాన్ని పరిషత్ సభ్యులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



పెదపూడి(మొవ్వ): మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవిలోని శ్రీ కృష్ణాశ్రమంలో ఆంగ్ల సంవత్సర ప్రారంభమై రోజైన ఆదివారం హనుమంతునికి విశేష పూజలు నిర్వహించారు. ఆశ్రమంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి 108 వడమాలలో వేసి ప్రత్యేక పూజలు చేశారు. ముముక్షు జన మహాపీఠాధిపతులు సీతారామ్ గురుదేవుల పర్యవేక్షణలో 108 సార్లు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



నాగాయలంకలో ఇళ్ల ముందు రంగవల్లులు



మంత్రి జోగి రమేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఎస్పీ జాషువా

పెడన: నూతన సంవత్సర వేడుకలను వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, శకుంతలదేవి దంపతులు కేక్ కోసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్ కూడా పాల్గొన్నారు. అనంతరం జిల్లా, డివిజన్, మండల అధికారులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రి దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా ఎస్పీ జాషువా, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలున్నారు. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, వెలుగు పీడీ ప్రసాదరావు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి గీతాబాయిలతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, వివిధ కార్యాలయ ఉద్యోగులున్నారు. పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు భళ్ల జోత్స్నరాణి, గంగయ్యలు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వెంకటరామానాయుడు దంపతులు, పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, అచ్యుతరావు దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కౌన్సిల్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

అవనిగడ్డ: దివిసీమలోని పలుచర్చిల్లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో ఏలూరు ప్రధాన విచారణ గురువు చాకో, స్థానిక ఫాదర్ సురేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అవనిగడ్డలోని సీబీసీఎన్‌సీ, పెంతెకోస్తు, ఫిలదెల్ఫియా, లేమెన్స్ ఇవాంజికల్, హోసన్నా ప్రార్థనా మందిరాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు భారీ కేక్‌ని కట్ చేసి పార్టీ నాయకులు, అభిమానులు, అధికారులకు అందజేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐలు రవికుమార్, శ్రీనివాస్, పార్టీ నాయకులు, ఎమ్మెల్యే సింహాద్రికి పుష్ప గుచ్ఛం, పుస్తకాలు, మొక్కలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయలంక: నాగాయలంక మూడో వార్డు తూర్పుబజారు రోడ్డులో రంగవల్లులు తీర్చిదిద్ది గృహిణులు కేక్ కోశారు. యువత బాణసంచా కాల్చి సందడి చేశారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ టీఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది పోలీసు బందోబస్తు నిర్వహించారు. మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ భోగాది వెంకటశేషగిరిరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అవనిగడ్డ వెళ్లి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును కలసి శుభాకాంక్షలు చెప్పారు.

కృత్తివెన్ను: సీతనపల్లి సీఎస్ఐ చర్చిలో సిస్టర్ మరియమ్మ కేక్ కోసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కృత్తివెన్ను ఇమ్మానియేల్ చర్చి మినిస్ట్రీస్ వద్ద పాస్టర్ బీవీ డానియల్‌రాజు ఆధ్వర్యాన ఆదివారం భారీ ప్రేమవిందు నిర్వహించారు.

అవనిగడ్డ: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనారాయణస్వామి, గీతామందిరం, రాజశేఖరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు.



పెడన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి జోగి రమేష్ దంపతులు



మచిలీపట్నంలో కేక్ కోస్తున్న పేర్ని నాని, మేయర్ వెంకటేశ్వరమ్మ

కోనేరుసెంటర్: బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పేర్ని నాని న్యూఇయర్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ జాషువా, అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు పేర్నిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ మహిళా కార్పొరేటర్లు, నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో పేర్నితో కేక్ కోయించారు. పలు ఉద్యోగ సంఘాల నాయకులు క్యాలెండర్‌లను ఆవిష్కరింపజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్ని కిట్టును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ముడా చైర్మన్ బొర్రా దుర్గాభవాని, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సిలార్‌దాదా, మాజీ ఎంపీపీ తోట శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: బైపాస్‌రోడ్డులోని జీజీఎం చర్చి, ఈడేపల్లిలోని ది పెంతుకోస్తు మిషన్ చర్చి, మాచవరంలోని జియోన్ చర్చి, డ్రైవర్స్‌కాలనీలో చర్చి, బందరుకోటలో చర్చిలలో జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని బేతేలు మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ నేరెళ్ల వాల్టరస్ ప్రేమ్‌కుమార్ ప్రార్థనలు చేశారు. అనంతరం జిల్లా సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ చైర్మన్ గూడవల్లి నాగరాజు, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నగర నాయకులు కేక్ కోశారు. మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. నగర కమిషనర్ జి.చంద్రయ్య, ఎంహెచ్‌వో వై.బాలసుబ్రహ్మణ్యం, ఎంఈ శ్రీకాంత్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటరామాంజనేయులు, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు మాసూంబాషా, మహబూబ్‌బాషా, సత్యానందం, జయపాల్, సీఐలు, ఎస్సైల సమక్షంలో ఎస్పీ న్యూఇయర్ కేకును కోసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కోడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచి వెన్నా షైనీ, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం, కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద కూడా వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా వీఆర్వోలు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కోడూరు పీఎస్, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్ స్టేషన్లలో సిబ్బంది వేడుకలు జరిపారు. టీఏ స్టార్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రూప్ అధినేత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్ రంజిత్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ రంజిత్‌బాషాకు జిల్లా అధికారులు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బంగ్లాలో ఉన్న కలెక్టర్ రంజిత్‌బాషా ను జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఎంయుడీఏ వీసీ శివనారాయణరెడ్డి, ఆర్డీవోలు శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్డీఏ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఈవో తాహెరాసుల్తానా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రాఘవరావు, జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, సర్వేశాఖ ఏడీ గోపాలరాజు, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.